సింహగిరుల్లో భక్తజన ప్రవాహం



తెన్నేటి పార్కు బీచ్ రోడ్డులో భక్తుల సందడి

- అడుగులన్నీ సింహగిరి వైపే..
- నమో నారసింహ అంటూ భక్తుల పులకింత
- గిరిప్రదక్షిణతో కిటకిటలాడిన రహదారులు



ముడసర్లోవ వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న విశ్వాస్ సంస్థ సభ్యులు



అల్పాహారం పంపిణీ చేస్తున్న విజయసాయి యోగ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు



విశాలాక్షినగర్ రోడ్డులో భక్తులు



అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆరిలోవ: అప్పన్న గిరి ప్రదక్షిణ భక్తులతో శనివారం బీఆర్‌టీఎస్ కిటకిటలాడింది. ఉదయం 7 గంటలకే భక్తులు నడక ప్రారంభించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సింహాద్రి అప్పన్నపై తమ భక్తి చాటుకోవడానికి సిద్ధమయ్యారు. గొడుగులు చేతబట్టి ప్రదక్షిణ ప్రారంభించారు. ఉదయం వర్షం తగ్గడంతో ఊపిరి పీల్చుకొన్నారు. స్వామి నామస్మరణతో అప్పన్నకొండను అవలీలగా చుట్టేశారు. భక్తుల తాకిడితో బీఆర్‌టీఎస్ రోడ్డులో అన్ని లైన్‌లు అడవివరం నుంచి హనుమంతవాక సందడిగా మారాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు భక్తులు రోడ్లపై పలచగా కనిపించినా ఆ తర్వాత నుంచి రోడ్లు కిటకిటలాడాయి. గొడుగులు వేసుకొన్న భక్తుల మధ్యలో వాహనాలు వెళ్లడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. అడవివరం నుంచి హనుమంతవాక మీదుగా జోడుగుళ్లపాలెం వరకు ఎక్కడ చూసినా గిరి ప్రదక్షిణ భక్తుల సందడే కనిపించింది. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు అందించిన ప్రసాదం స్వీకరిస్తూ భక్తులు ఆకలి తీర్చుకొన్నారు.

స్వచ్ఛంద సంఘాల ప్రసాద వితరణ

భక్తులు ఆకలి తీర్చడానికి దాతలు ముందుకొచ్చారు. జీవీఎంసీ, సింహాచలం దేవస్థానం అధికారులు పలుచోట్ల తాగునీరు, మందులు, సరఫరా చేశారు. పైనాపిల్‌కాలనీ నుంచి జోడుగుళ్లపాలెం వరకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రామ సంఘాలు, వివిధ ఆలయాల నిర్వాహకులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం, పులిహోరా, మంచినీరు, మజ్జిగ, టీ, చక్కెర పొంగలి, శనగలు, బూరెలు, బజ్జీలు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన పలు ప్రసాద వితరణ కేంద్రాలలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వార్డుల కార్పొరేటర్లు ఆయా ప్రాంతాలలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. విశాఖ కేంద్ర కారాగారం వద్ద జైల్, ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది సంయుక్తంగా స్టాల్ నిర్వహించారు. ముడసర్లోవ వద్ద మామిడి తోటలో విశ్వాస్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోరా, పరమాన్నం, తాగునీరు, మందులు అందజేశారు. ముడసర్లోవ వద్ద ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉప్మా, పులిహోరా అందజేశారు. ఇదే ప్రాంతంలో ఆరిలోవ మెడికల్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మిరియాలు పాలు, మందులు, తాగునీరు సరఫరా చేశారు. చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్న సమారాధన నిర్వహించారు.

గిరి ప్రదర్శనకు పోటెత్తిన భక్త జనం

మద్దిలపాలెం: ఓం నమో నారసింహాయ నమః అంటూ భక్తజనం నినాదాలతో పాతవెంకోజీపాలెం కూడలి హోరెత్తిపోయింది.అప్పన్న గిరిప్రదక్షిణకు భక్తజనం భారీగా తరలివచ్చింది. సింహగిరితోపాటు, కైలాసగిరిని చుట్టు తిరిగిన జనం పాత వెంకోజీపాలెంలో ఆంజయనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిని దాటుకుని హెచ్‌బీకాలనీలోకి ప్రవేశించారు. వీరిని రోడ్డు దాటించడంలో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. దీంతో నిమిషాల వ్యవధిలో వాహనాలు కిలోమీటరు మేరకు బారులుదీరాయి. అయితే వృద్ధులు సేదదీరడానికి సరైన ఏర్పాట్లు చేయలేదని పలువురు అసహనం వ్యక్తం చేశారు. కిలోమీటర్ల మేర నడుచుకుంటు వస్తున్న భక్తులు కాసేపు కూర్చోవడానికి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోటెత్తిన అప్పుఘర్ తీరం

ఎంవీపీకాలనీ: గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో అప్పుఘర్ తీరం పోటెత్తింది. 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణలోని ముఖ్యమైన ప్రాంతాల్లో అప్పుఘర్ ఒకటికావడంతో భక్తులు తరలివచ్చారు. తెన్నేటి పార్కు మీదుగా అప్పుఘర్‌తీరానికి చేరుకొని సముద్రపు నీళ్లు తలపై చల్లుకున్నారు. వాతావరణ ప్రభావంతో అలల ఉధృతంగా ఉన్న కారణంగా ఈ ఏడాది భక్తులను సముద్ర స్నానానికి అనుమతించలేదు. గజ ఈతగాళ్లు అందించే సముద్ర నీరును భక్తులు తలపై చల్లుకుని వెనుదిరిగారు. భక్తులకు అల్పాహారం, మంచినీరుతో పాటు ఆహార పదార్థాలను స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేశాయి.శ్రీవారి రథాన్ని టీటీడీ కూడలిలో కొద్దిసేపు నిలిపారు. ఈ సందర్భంగా టీటీడీ కల్యాణ మండపం సిబ్బంది శ్రీవారికి హారతి అందించారు. జోన్–3 జీవీఎంసీ అధికారులు అప్పుఘర్ కూడలిలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు.

భక్తులకు పులిహోర, బిర్యానీ పంపిణీ

మద్దిలపాలెం: గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు కేఆర్‌ఎం కాలనీ, నరసింహనగర్ ప్రాంతాల వద్ద శనివారం పీవీఆర్ ప్రాజెక్ట్స్, శ్రావణి డెవలపర్స్ సంయుక్తంగా తాగునీరు, పులిహోర అందజేశారు. సుమారు 15 వేల మందికి ప్రసాదం వితరణ చేశామని పీవీఆర్ అధినేత పి.వెంకటేశ్వర గుప్తా తెలిపారు. రాజం నాయుడు, శ్రావణి డెవలపర్స్ యాజమాన్యం పాల్గొన్నారు.

- శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో పాత వెంకోజీపాలెంలో సంఘ ప్రతినిధులు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు చేతుల మీదుగా భక్తులకు బిరియాని పంపిణీ చేశారు. సద్గురు సాయినాథ్ వెల్ఫేర్ అసోసియేషన్, కిరణ్మయి మహిళా మండలి ఆధ్వర్యంలో సింహాద్రి అప్పన్న ప్రతిమను ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.



కేఆర్‌ఎం కాలనీ కూడలిలో భక్తులకు ప్రసాదం అందిస్తున్న పీవీఆర్, శ్రావణి డెవలపర్స్ యాజమాన్యం

నిరుపయోగంగా ఔషధాల స్టాల్

లుంబినీ పార్కులోని ఒక మూల ఔషధాల స్టాల్ ఏర్పాటు చేయడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఎవరికీ కనిపంచని విధంగా స్టాల్ ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారింది. చాలా మంది భక్తులు ఔషధాలు ఎక్కడ అందుబాటులో ఉంచారో తెలియక ఇబ్బందులు పడ్డారు.

ముడసర్లోవ వద్ద నిలిపేసిన ఆటోలు

గిరిప్రదక్షిణ కోసం హనుమంతవాక వైపు నుంచి ఆటోలలో వెళ్లే భక్తులను పోలీసులు ముడసర్లోవ వద్ద నిలిపేశారు. ఆ ఆటోలను వెనుకకు మళ్లించారు. ఆటోలలో వెళ్లిన భక్తులను ఆర్టీసీ, దేవస్థానం బస్సుల్లో అడవివరం తరలించారు.

పారిశుధ్య సేవలు

రోడ్డు పొడవునా జీవీఎంసీ జోన్–2, పారిశుధ్య కార్మికులు ధారపాలెం నుంచి జోడుగుళ్లపాలెం వరకు, జోన్–3 పారిశుధ్య కార్మికులు అప్పుఘర్ నుంచి వెంకోజీపాలెం మీదుగా హెచ్‌బీకాలనీ వరకు ఎప్పటికప్పుడు రహదారులు శుభ్రం చేశారు. భక్తుల కోసం రోడ్లు పక్కన డస్ట్‌బిన్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.



ముడసర్లోవ కూడలి వద్ద ఆటోలు నిలిపి భక్తులను దించుతున్న పోలీసులు



వెంకోజీపాలెం కూడలి వద్ద ట్రాఫిక్ జామ్

సీపీ సందర్శన

బీఆర్‌టీఎస్‌లో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులతో కలసి సందర్శించారు. అన్ని కూడళ్లలో పోలీస్ బందోబస్తు, భక్తులు తాకిడి, వారికి రక్షణ చర్యలు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పైనాపిల్‌కాలనీ నుంచి హనుమంతవాక మీదుగా విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు బీచ్ రోడ్డు వరకు 150 మంది పోలీసులు సేవలందించారు. ట్రాఫిక్ పోలీసులు జీపుల్లో నిరంతరం తిరుగుతూ ఎక్కడా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.



హెచ్‌బీకాలనీలో కిక్కిరిసిపోయిన భక్తజనం

మందుల స్టాళ్లు కనిపించలేదు



చాలా ఏళ్లుగా మా మిత్రులంతా కలిసి గిరిప్రదక్షిణకు వస్తున్నాం. మధ్యాహ్నం 12 గంటలకు సింహాచలం చేరుకున్నాం. అక్కడ కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ ప్రారంభించాం. గతంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా ఔషధాల స్టాళ్లు పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచేవారు. అయితే ప్రస్తుతం ఆ స్టాల్స్ కనిపించలేదు. దీంతో కాళ్ల నొప్పులు, ఇతర సమస్యలు ఉన్నవారు ఇబ్బందులు పడ్డారు. ఔషధాల స్టాళ్లు అందుబాటులో ఉంచితే బాగుండేది.

– డి.దుర్గా, కాకినాడ జిల్లా పిఠాపురం

మహిళలకు టాయిలెట్స్ సౌకర్యం లేదు



మేమంతా కొన్నేళ్లుగా గిరిప్రదక్షణలో పాల్గొంటున్నాం. వరాహాలక్ష్మీనరసింహ స్వామి మాకెంతో ప్రత్యేకం. ఈ సారి ప్రదక్షిణలో మహిళల కోసం టాయిలెట్స్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది. చాలా దూరం ప్రయాణించినా టాయిలెట్లు కనిపించ లేదు. దీంతో చాలా మంది మహిళలు ఇబ్బంది పడ్డారు.

– హేమలత, వన్‌టౌన్, విశాపట్నం

క్లుప్తంగా

కాలువలో పూడిక తీత



పూడిక తొలగించిన అనంతరం కాలువ

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం: ఎట్టకేలకు కాలువలో పూడిక తీశారు. 'పేరుకుపోయిన పూడిక శిర్షికతో 'సాక్షి' పత్రికలో ఈ నెల 19న ప్రచురితమైన వార్తకు స్పందించారు. పిఠాపురంకాలనీ సర్వీసు రోడ్డులో కాలువ పూడికతో నిండిపోయింది. అధికారులుస్పందించి పూడిక తొలగించారు.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

భవనం పైనుంచి పడి మేస్త్రి మృతి



రౌతు పాపారావు (ఫైల్)

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు లేబర్ మేస్త్రీ రౌతు పాపారావు(45) మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాలాక్షినగర్‌లో ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఇందులో భాగంగా శనివారం లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టారు. లిఫ్ట్ అమర్చే క్రమంలో భవనం రెండో ఫ్లోర్‌లో ఉండగా.. దాని అడుగు భాగం తొట్టె లేబర్ మేస్త్రీ రౌతు పాపారావుపై జారిపడింది. దానితోపాటు కిందపడిన మేస్త్రీ తలకు తీవ్రగాయాలై మెడ భాగం కొంత కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బతుకుతెరువు కోసం వచ్చి..

రౌతు పాపారావుది విజయనగరం జిల్లా మెంటాడ మండలం పోరాం గ్రామం. అక్కడ నుంచి కొన్నేళ్ల కిందట బతుకుతెరువు కోసం విశాఖపట్నం వచ్చి 10వ వార్డు రవీంద్రనగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలున్నారు. భవన నిర్మాణ పనుల్లో లేబర్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరు పిల్లల్లో పెళ్లీడుకొచ్చిన కుమార్తె ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. కుమారుడు చదువుతున్నాడు. కుటుంబాన్ని పోషించే పాపారావు మృతి చెందడంతో అతడి భార్య, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఏయూలో లింగ సమానత్వంపై జాతీయ వర్క్‌షాప్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లింగం, సమానత్వం, ప్రజాస్వామ్య రూపురేఖలు అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావుతో పాటు న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీతామాణిక్యం పాల్గొని లింగ సమానత్వం ప్రజాస్వామ్య సమాజంలో ఎంత ముఖ్యమైనదో వివరించారు. లింగ సమానత్వం చారిత్రాత్మక ప్రముఖ్యత, ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై వ్యక్తలు చర్చించారు. అనంతం వర్క్‌షాపు కన్వీనర్, ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ రచించిన 'ఎంపవరింగ్ ఉమెన్ ఫర్ ఏ సస్టైయినబుల్ ఫ్యూచర్' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. లింగ సమానత్వం, స్థిరత్వం సాధన కోసం వ్యూహాలను ఈ పుస్తకం వివరిస్తుందని ఆచార్య జేమ్స్ స్టీఫెన్ వెల్లడించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఈ వర్కుషాపును నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వినోద్ కుమార్, డాక్టర్ దివాకర్ వాడపల్లి, డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

24న 'లైమ్‌లైట్స్' అవార్డుల ప్రదానం



వివరాలు వెల్లడిస్తున్న ఈమా సభ్యులు

తాటిచెట్లపాలెం: ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్(ఈమా) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 24న మధురవాడలోని వీ కన్వెన్షన్స్‌లో లైమ్‌లైట్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు ఈమా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌కుమార్, షరీఫ్‌ఖాన్ తెలిపారు. నరసింహనగర్‌లోని తమైరా బ్యూటీ క్లినిక్‌లో శనివారం మీడియా సమావేశంలో వీరు వివరాలు వెల్లడించారు. ప్రతిభావంతులైన ఈవెంట్ మేనేజర్లు, కళాకారులు, ఈవెంట్ రంగంలోని విభిన్న విభాగాల్లో పనిచేసే వారికి సుమారు 20 కేటగిరీల్లో అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఎంట్రీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈవెంట్ ప్రధాన స్పాన్సర్ తమైరా స్కిన్ అండ్ బ్యూటీ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.జ్యోతి స్వరూప మాట్లాడుతూ ఈమా అవార్డుల వేడుకల్లో తాము భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో ఈమా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ఎస్.రాజు, జాయింట్ సెక్రటరీ సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యుడు జగదీష్, ఆషా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న పదాన్

బీచ్‌రోడ్డు: బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్యాంకు రీజినల్ మేనేజర్ పీఎం పదాన్ మాట్లాడుతూ 116 ఏళ్లగా ఖాతాదారుల ఆదరణను చూరగొని దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా బ్యాంక్ ఆఫ్ బరోడా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అనేక సామాజిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

పెరిగిన ముడసర్లోవ నీటి మట్టం

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ నీటి మట్టం పెరిగింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంబాలకొండ, సింహాచలం కొండల నుంచి వచ్చిన వరద నీరు రిజర్వాయర్‌లో చేరుతుంది. దీంతో నీటి మట్టం పెరిగింది. రిజర్వాయర్ సామర్థ్యం 169 అడుగులు కాగా కొద్ది నెలలుగా వర్షాలు లేకపోవడంతో బాగా తగ్గిపోయింది. మూడు రోజుల క్రితం వరకు 150 అడుగులు ఉన్న నీటి మట్టం వర్షాలకు చేరిన నీటితో శనివారం 152.5 అడుగులు దాటినట్లు జీవీఎంసీ ముడసర్లోవ నీటి సరఫరా విభాగం సిబ్బంది తెలిపారు. వర్షాకాలం కావడంతో మరికొద్ది రోజుల్లో నీటి మట్టం సామర్థ్యాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు.

హుద్‌హుద్ ఇళ్లకు తాళాలు

మధురవాడ: బక్కన్నపాలెంలో నవోదయ వద్ద హుద్‌హుద్ కాలనీ, పోలీసు బెటాలియన్ తదితర సంస్థల నిర్మాణం తమ నుంచి భూములు తీసుకుని పరిహారం ఇంతవరకు చెల్లించకపోవడంతో బాధిత రైతులు ఆందోళన నిర్వహించారు. సీపీఎం నేతల ఆధ్వర్యంలో కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెంలకు చెందిన రైతులు హుద్‌హుద్ ఇళ్లకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు అప్పలరాజు మాట్లాడుతూ రైతులు పట్ల ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రెవెన్యు అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఇక్కడ రైతులకు ఇళ్లు ఇవ్వకుండా వేరే వాళ్లకి కేటాయించారని ఇది అన్యాయమన్నారు. ఇప్పటికైనా బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. వీరికి న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ముందుకొచ్చిన సముద్రం



జోడుగుళ్లపాలెం తీరం వద్ద ముందుకొచ్చిన సముద్రం నీరు



సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద ఇలా..

ఆరిలోవ: తుపాను ప్రభావంతో సముద్రం కెరటాలు ఎగిసిపడుతున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సముద్రం నీరు తీరంలో మరింత ముందుకొచ్చింది. జోడుగుళ్లపాలెం, సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద సముద్రం నీరు గతంలో కంటే ముందుకు చేరింది. ఒడ్డున విశాలమైన ఇసుక దిబ్బలు సగానికి పైగా మునిగిపోయాయి. సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద రాళ్లకు కొంత దూరంలో ఉండే నీరు ఇప్పుడు వాటిని దాటి ముందుకు వచ్చింది. దీంతో బీచ్ లోపలకు సందర్శకులు ఎవరూ వెళ్లే సాహసం చేయకుండా రోడ్డు మీద నుంచే కెరటాలను తిలకిస్తున్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి గిరిజన సంఘాల అభినందన



హుస్సేన్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

ఎంవీపీకాలనీ: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జె.హుస్సేన్ నాయక్‌కు గిరిజన సంఘాలు అభినందనలు తెలిపాయి. హుస్సేన్ నాయక్ రెండు రోజులుగా విశాఖ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు, సభ్యులు పోర్టు గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్, పోర్టు ట్రస్ట్‌తో పాటు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పీవీ రమణ, యామిని కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో స్టాఫ్‌నర్స్ భర్త వీరంగం

ఎంవీపీకాలనీ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో ఇన్‌చార్జ్ స్టాఫ్‌నర్స్ భర్త శనివారం వీరంగం సృష్టించాడు. ఇన్‌చార్జ్ స్టాఫ్‌నర్స్‌తో కలిసి ఆమె భర్త ఈసీజీ పరీక్ష కోసం శనివారం ఆస్పత్రికి వచ్చాడు. అయితే ఆ సమయంలో సిబ్బంది మరో మహిళకు ఈసీజీ చేస్తున్నారు. దీంతో ఈసీజీ సెంటర్ డోర్లు క్లోజ్ చేసుకున్నారు. ఇంతలో స్టాఫ్‌నర్స్‌తో కలిసి అతని భర్త తక్షణమే డోర్లు ఓపెన్ చేయాలంటూ గట్టిగా తట్టాడు. లోపల ఈసీజీ స్కాన్ జరుగుతుండటంతో సిబ్బంది డోర్లు ఓపెన్ చేయకపోవడంతో మరింత గట్టిగా కొట్టి హంగామా సృష్టించాడు. అనంతరం డోర్లు ఓపెన్ చేయడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విరుచుపడ్డాడు. దీంతో పాటు డీఎంవీకి సైతం ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ నర్సుతో పాటు ఆమె భర్త తీరుపై సిబ్బంది విమ్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఏయూ వీసీకి అభినందనలు



వీసీఆచార్య శశిభూషణ్‌రావును సత్కరిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపక బృందం

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ ఇన్‌చార్జీ వీసీ ఆచార్య జి.శశి భూషణరావును శనివారం మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం కలిసింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు వీసీ శశిభూషణరావును సత్కరించారు.